క్లుప్తంగా

ఘనంగా మాస శివరాత్రి పూజలు



రామలింగేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో గురువారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న దేవతా మూర్తులను అలంకరించి పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉక్కు ఫీల్డ్ మిషనరీ విభాగం ఉద్యోగుల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సుధాకర్, చీకటి శ్రీనివాస్, నాగేశ్వర శర్మ, రాధాకృష్ణ, ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ రమణమ్మకు నివాళి



రమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: మాజీ కౌన్సిలర్ స్వర్గీయ సండ్రాన రమణమ్మ చిత్రపటానికి పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధానకార్యదర్శి సండ్రాన నూకరాజు తల్లి, మాజీ కౌన్సిలర్ సండ్రాన రమణమ్మకు వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌ఛార్జ్ గుడివాడ లతీష్, నాయకులు ఆదినారాయణ తదితరులు గురువారం నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు.

పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యలు



డాక్టర్ శాంతిప్రియ

అక్కిరెడ్డిపాలెం: పుట్టుకతోనే పిల్లల్లో అనేక రకాల గుండె సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయని షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ కడల్స్ (తల్లీ బిడ్డ) ఆస్పత్రి కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.శాంతిప్రియ అన్నారు. పిల్లల్లో ఎదురయ్యే గుండె సంబంధిత సమస్యలపై ఆస్పత్రిలో గురువారం అవగాహన కల్పించారు. పుట్టిన వెయ్యి మంది పిల్లల్లో 8 నుంచి 10 మంది గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ముందస్తుగా ఈ సమస్యను గుర్తించగలిగితే ప్రమాదాన్ని నివారించవచ్చన్నారు. మేనరికం వివాహాలు చేసుకున్న వారికి పుట్టబోయే పిల్లల్లో ప్రతీ వెయ్యి మందిలో 40 నుంచి 50 మందికి గుండె లోపాలు ఉండే అవకాశం ఉందన్నారు.

పరిశుభ్రంగా దిబ్బపాలెం పాఠశాల

పెదగంట్యాడ: మన స్కూల్ – మన బాధ్యతలో భాగంగా స్వచ్ఛందంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్ బాబు సూచించారు. అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా దిబ్బపాలెం పాఠశాల ఆవరణను గురువారం శుభ్రం చేశారు. పులి యువజన సంఘం సభ్యులు పాఠశాల ఆవరణలోని చెత్త తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆ మొక్కలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యత తీసుకున్నారు. ఈ మొక్కలకు ట్రీ – గార్డ్స్, రక్షణ గార్డులను ఫౌండేషన్ వారు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పనర్సమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం

వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు



శిబిరంలో ఉరుకూటి చందు, తదితరులు



రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత, తదితరులు



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పాత అయ్యన్నపాలెం సచివాలయ పరిధి నెల్లిముక్కు పీహెచ్‌సీ వద్ద గురువారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా వుండాలన్న మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. ఉచితంగా మందులు అందించడంతోపాటు, అవసరమైన వారిని కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసి ఆరోగ్యశ్రీ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమం దేశంలో మన రాష్ట్రంలోనే అమలవుతోందన్నారు. జగనన్న ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వైద్య రంగంలో ఇప్పటికే అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. శిబిరంలో 311 మందికి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రమేష్‌బాబు, హేమలత, జనరల్ డాక్టర్ మానస, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ విజయలక్ష్మి, ఎముకుల డాక్టర్ డాక్టర్ సుధీర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఐవో జీవన్‌రాణి, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్, తనకాల సత్యనారాయణ, అమ్మాజీ, కొయ్య భారతి, ఉరుకూటి సింహాద్రి, మొల్లి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

67వ వార్డులో 305 మందికి వైద్య పరీక్షలు

గాజువాక: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌లతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని జీవీఎంసీ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. 67వ వార్డు పెంటయ్యనగర్ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లు స్వయంగా వైద్య సేవలను అందిస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీదైన వైద్యం కూడా పేదలకు ఉచితంగా అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. డీసీఎంఎస్ ఛైర్ పర్సన్ పల్లా చినతల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పేదల సంక్షేమం, వారి ఆరోగ్యం కోసం ఆలోచిస్తారన్నారు. అందువల్లే ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ప్రజలు వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ శిబిరంలో 305 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.ఫ్లెవియా మోనికా, సచివాలయ కన్వీనర్లు లక్ష్మి, ప్రశాంత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్ష కిట్‌లను అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు

ఆశ వర్కర్ల ఆందోళన



న్యూపోర్టు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

పెదగంట్యాడ: ఆశ వర్కర్లను అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం విజయవాడ వెళ్లేందుకు సిద్ధం కాగా వారిని హౌస్ అరెస్టు చేయడం సరికాదన్నారు. ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల వెంకయ్య, హేమలత, సోమేశ్వరి, రేణుకావతి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. శాతవాహననగర్ రోడ్ నంబర్ 1 నుంచి 9 వరకు, అశోక్‌నగర్, శివాజీనగర్, ఆల్ ఇండియా రేడియో, శివసాయినగర్, శాతవాహననగర్ రోడ్ నంబర్ 9, యాతపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆలోచింపజేసిన జేవీవీ ప్రదర్శనలు



నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

గాజువాక: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) కళాకారులు ప్రదర్శించిన సైన్స్ నాటికలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కోసం జేవీవీ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో ప్రారంభమైన బస్సుయాత్ర గురువారం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చేరింది. ఈ సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో కళాకారులు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా వివిధ నాటికలు ప్రదర్శించారు. అనంతరం జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు పెచ్చురిల్లుతున్నాయని, వాటిని నమ్మి ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని చెప్పారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రభుత్వాలు చట్టాలు చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి వల్ల దేశం ఎన్నో రంగాల్లో ముందుకు సాగుతోందని, విద్యార్థులు కూడా సైన్స్ ఆవిష్కరణలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ ఎం.రమేష్ కుమార్, కె.శేషగిరిరావు, ఎస్.వి.రమణ, పి.లక్ష్మణస్వామి, ఎల్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

ఉక్కునగరం: ఇటీవల స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సౌత్ జోన్ ఏసీపీ టి.త్రినాథ్ గురువారం దర్యాప్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీసీ విభాగాధిపతి ఎస్.భాను తనపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా నియమితులైన త్రినాథ్ ఎల్ అండ్ డీసీ విభాగానికి వచ్చి ఫిర్యాదుదారు ఎస్.భాను, సాక్షులను విచారించారు.

అందుబాటులోకి నింబస్ యాప్ సేవలు



నింబస్ సేవలు ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయంలో ఈ–రిసోర్సెస్‌ని విద్యార్థులకు అందుబాటులో ఉండేలా కొత్తగా నింబస్ ఎం లైబ్రరీ మొబైల్ యాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గురువారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో నింబస్ యాప్ సేవలను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. విభిన్న డిజిటల్ రిసోర్సెస్‌ని విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు ఉపయుక్తంగా నిలిపేలా ఈ సేవలు దోహదపడనున్నాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేకంగా హాస్టళ్లలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, లైబ్రేరియన్ ఆచార్య పి.వెంకటేశ్వర్లు, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఆచార్య వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి అభినందనలు



సుబ్బారెడ్డితో నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి

గాజువాక: వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి గురువారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యత్వానికి సుబ్బారెడ్డిని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను వివరించినట్టు నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి తెలిపారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారికి త్రికాల పంచామృతాభిషేక సేవ చేశారు. రూ.1,500 రుసుం చెల్లించి సహస్ర తులసీదళార్చనలో, రూ.1,000 రుసుం చెల్లించి త్రికాల పంచామృతాభిషేక సేవలో భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్ష కేంద్రాల తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ, ఎంబీఏ హాస్పిటాలిటీ మూడో సెమిస్టర్ పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఏయూ ఐఏఎస్ఈ భవనంలో జరుగుతున్న పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అంతా కృషి చేయాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. మధురవాడ వాంబేకాలనీ సునీల్ శర్మకాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎలిమెంటరీ స్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన పద్ధతులు ఉపయోగించి విద్యార్థులకు మరింత చక్కగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్స్ వినియోగం పెంచాలని, పాఠాలు వీక్షించాలన్నారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కూరమాన గీతాదేవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మహోద్యమంగా కార్మికుల ఉక్కు దీక్ష'



దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న దీక్ష మహోద్యమంగా మారనుందని, ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1092వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలను అమ్మే హక్కు లేదన్నారు. ఉక్కు ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు సృష్టించినా నిలదొక్కుకుని లాభాల బాటలో కొనసాగుతుందన్నారు నిర్వాసితులకు, కార్మికులకు అన్యాయం చేస్తూ సంస్థను అమ్మడం దుర్మార్గమని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకోవాలని వినతి



కేరళ ముఖ్యమంత్రి విజయన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సహకరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కోరారు. గురువారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం 66 గ్రామాలకు చెందిన ప్రజలు తమ భూములు కోల్పోయారన్నారు. సొంత గనులు కేటాయించకపోయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి వివిధ పన్నులు, లాభాల రూపేణా రూ.55 వేల కోట్లు తిరిగి చెల్లించిందన్నారు. మరోవైపు సెయిల్‌ను విస్తరించడానికి ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు చేయడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, ఎన్.రామారావు, చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉక్కునగరం యూనిట్‌కు నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. యూనిట్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. కోశాధికారి తమ నివేదికను సమర్పించా రు. అనంతరం అధ్యక్షునిగా ఆర్.వి.వి.ఎన్.జగపతిరాజు, కార్యదర్శిగా జి.శ్రీనివాస్, ఛైర్మన్‌గా వి.ఆర్.కె.రాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.భాస్కరరాజు, పి.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.సూర్యకుమార్‌తోపాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర శాఖ నుంచి కె.వి.రాజు, ఎస్.ఆర్.సి.మోహన్‌రావు పర్యవేక్షలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

'యాత్ర – 2' చిత్ర థియేటర్ల వద్ద సందడి



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న చందు, కార్పొరేటర్లు

గాజువాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయోపిక్‌గా రూపొందించిన యాత్ర–2 సినిమా విడుదలైన గాజువాక శ్రీకన్య థియేటర్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం సందడి చేశారు. సినిమా విడుదల సందర్భంగా థియేటర్ల వద్ద నాయకులు కేక్‌లను కట్ చేసి ముఖ్యమంత్రి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సినిమా హాళ్ల వద్ద పండగ వాతావరణం చోటుచేసుకుంది. పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తమ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉదయం, మ్యాట్నీ ఆటల్లో సినిమాను వీక్షించారు. వారందరికీ చందు, చింతలపూడి టికెట్లను ఉచితంగా అందజేశారు. చందు ఆధ్వర్యంలో ఉదయం ఆటను, చింతలపూడి ఆధ్వర్యంలో మ్యాట్నీ ఆటను పార్టీ శ్రేణులు వీక్షించాయి. ప్రపంచంలోనే అతి శక్తిమంతమైన సోనియా గాంధీని జగన్‌మోహన్‌రెడ్డి ఒంటి చేత్తో ఢీకొట్టి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చిన రియల్‌హీరో అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. సినిమా సూపర్ హిట్ అయిందని హర్షం వ్యక్తం చేశారు. సినిమా వీక్షించినవారిలో కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళమెత్తాలి



విజయసాయిరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యసభలో వాణి వినిపించాలని వైఎస్సార్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డిని ఢిల్లీలో గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్లాంట్‌కు సొంత ఐరన్ ఓర్ గనులను ఇప్పించాలని, కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, కె.ఎస్.ఎన్.రావు, మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, గొందేశి ప్రభాకరరెడ్డి, బోరా శశిభూషణరావు, సుబ్బయ్య, మద్ది అప్పలరాజు, పెద్దాడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి చేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.